ANNQUEST December 2014

ISSN: 2321-3043

www.stannsannquest.com

తెలుగు దినపత్రికలు-సాహిత్య సేవ

డాక్టర్.అద్దంకిసుబ్బలక్ష్మి

ప్రసారమాధ్యమాలలో పత్రికలకు అధిక ప్రాధాన్యము కలదు. . తెలుగు భాష-సాహిత్యములను పోషించుటలో, ఉత్తమమైన రచనలను ప్రోత్సహించుటలో తెలుగు పత్రికలు పోషించిన పాత్ర సాటిలేనిది. ముద్రణయంత్ర ఆవిష్కరణఫలితముగా దేశమంతటా పత్రికలు విస్తరించి, ఆంగ్ల ప్రభుత్వపాలనను ధిక్కరించుచు, స్వాతంత్ర్యోద్యమములో ప్రముఖపాత్రను పోషించినవి. ప్రజలలో దేశభక్తి , రాజకీయాలపట్ల అవగాహన కలిగించుటతోపాటు సాహిత్య విలువలను పత్రికలు పెంపొందించినవి.

తెలుగు సాహిత్యములోక్రీ.శ. 1806వ సంవత్సరమున తెలుగులో ముద్రణ ప్రారంభమైనట్లు సి.పి బ్రౌను అభిప్రాయము.1 క్రైస్తవమతప్రచార ఉద్దేశ్యముతో మిషనరీలు బళ్లారిలో ఎ.డి కాంపుబెల్ సహాయముతో క్రీ.శ. 1835లో తెలుగులో తొలి పత్రికగా భావిస్తున్న సత్యదూతను ప్రారంభించినట్లు తెలియుచున్నది..2 సత్యదూత తరువాత అదే ఉద్దేశ్యముతోవెలువడినవానిలో హితవాది, రవి , వివేకవతి అను పత్రికలు ముఖ్యమైనవి. క్రైస్తవ మతప్రచారకుల ప్రభావము వలన దేశమంతటా మత, సంఘ సంస్కరణోద్యమము తీవ్రముగా కొనసాగినది. బ్రహ్మసమాజము, ఆర్య సమాజము, దివ్యజ్ఞాన సమాజము మొదలైనవి తమ సిద్ధాంతముల ప్రచారము కొరకు పత్రికలను వెలువరచినవి. వానిలో తత్త్వబోధిని 1865,దివ్యజ్ఞాన దీపిక 1910,ధర్మ సాధిని 1914, ముఖ్యమైనవి. 3.

ప్రముఖ సంఘ సంస్కర్త శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు స్త్రీలకొరకు సతీహితబోధిని అను పత్రికను ప్రారంభించిరి. కాలక్రమేణా బాలిక, హిందు సుందరి, తెలుగు జనానా అనునవి మహిళలకొరకే వెలువడినవి. మహిళలు స్థాపించి, నిర్వహించిన పత్రికలు కలవు. వానిలో సావిత్రి 1910 1918, అనసూయ, నివేదన, హిందుయువతి, సౌందర్యవల్లి అనునవిప్రధానమైనవి. మహిళలకొరకు నిర్వహింపబడు పత్రికలలో శారద, గృహలక్ష్మి అనునవి అధికప్రజాభిమానమును పొందినవి.4

ప్రాచీన సాహిత్యమును పత్రికారూపములో ఆధునికులకు పరిచయము చేయుటలో కృషి చేసిన పత్రికలలో సుజనరంజని, కొక్కొండ వారి ఆంధ్రభాషా సంజీవని, పూండ్ల రామకృష్ణయ్యగారి అముద్రితగ్రంధచింతామణి, వైజయంతి, చింతామణి, సరస్వతి మొదలైనవి ప్రధానమైనవి.5

---

తెలుగు అధ్యాపకురాలు సెంట్ ఆన్స్ మహిళా కళాశాల, హైద్రాబాదు

subbalakshmi1310@gmail.com

క్రీ.శ1896లో స్థాపించబడిన దేశాభిమాని –విజయవాడ తెలుగులో తొలి దినపత్రిక.క్రీ.శ1885లోవెలువడిన ఆంధ్ర ప్రకాశిక తొలి వార్తా పత్రిక.6. తరువాత కృష్ణా పత్రిక 1908 , ఆ తరువాత ఆంధ్రపత్రిక 1908, మనోరమ1910,ఆంధ్రభారతి-1910,ఆంధ్రప్రభ 1930 మొదలైనవి ప్రసిద్ధమైనవి. తెలంగాణ ప్రాంతములోవెలువడిన తొలి తెలుగు పత్రిక హితబోధిని.తరువాత నీలగిరి,ఆంధ్రాభ్యుదయము మొదలైనవివెలువడినవి. సురవరము ప్రతాపరెడ్డిగారు గోలకొండ పత్రికను 1925 నుండి ద్వైవార పత్రికగా నిర్వహించగా, అనంతరము నూకల నరోత్తమరెడ్డిగారు 1947 నుండి దినపత్రికగా నిర్వహించిరి.1945లోతెలంగాణ,మీజాన్ పత్రికలు హైద్రాబాదునుండి వెలువడినవి..6.ప్రజాప్రభ 1951 లోహైద్రబాదు నుండి వెలువడింది.7ఈ పత్రికలు ఆరోజులలో నిజాంనిరంకుశపాలనను ఎదుర్కొనుచు, స్వల్పకాలము నడచినను ప్రజలలో దేశాభిమానమును, భాషాభిమానమును కలిగించుటలో ఇతోధికముగా సేవచేసినవి.

స్వాతంత్ర్యానంతరముతెలుగు దేశములో ఆంధ్ర పత్రిక,ఆంధ్ర ప్రభ, ఆంధ్రజ్యోతి,, ఆంధ్ర భూమి, విశాలాంధ్ర, మొదలైనవి బహుళ ప్రచారమును పొందిన దినపత్రికలు.వీటిలో కొన్ని దేశ స్వాతంత్ర్యమునకు ముందే ప్రారంభింపబడి,స్వాతంత్ర్యోద్యమమునకు, తెలుగువారి ఐకమత్యమునకు, రాజకీయ చైతన్యమునకు ఎంతగానో కృషిచేశాయి. ఆనాటి పత్రికల సంపాదకీయములు సామాన్య ప్రజలకు కూడ ఉత్తేజపూరితముగా, దేశభక్తిని ప్రేరేపించువిధముగా, స్ఫూర్తిదాయకముగా ఉండేవి. సంపాదకులకు కూడ ఒక ప్రత్యేక గుర్తింపును, ప్రాచుర్యాన్ని కలిగించేవిగా ఉండేవి. అటువంటి సంపాదకులలో సురవరం ప్రతాపరేడ్డిగారు , ఖాసా సుబ్బారావుగారు , ముట్నూరి కృష్ణారావుగారు , కాశీనాధుని నాగేశ్వరరావు గారు , నార్ల వేంకటేశ్వరరావు గారు మొదలైనవారు పేర్కొనదగినవారు..

నార్ల వారి ఆధ్వర్యములో వెలువడుతున్న ఆంధ్ర జ్యోతి మారుతున్న సమాజానికి అనుగుణముగా, ప్రజలలో కలుగుతున్న సామాజికచైతన్యానికి దర్పణముగా నిలచింది. నార్ల వారు సంపాదకీయాలలో ఆధునికత, వ్యాఖ్యలలోను ఆలోచనలలోను ఆధునికతను చూపుతు పత్రికను అభ్యుదయమార్గములో నడిపిరి.8

ఆంధ్రపత్రిక తొలుత భాషలో గ్రాంధిక వ్యవహారము, శైలిలో సనాతనత్వము గోచరించినా క్రమేపి మార్పును సంతరించుకొని, ప్రజాభిమానమును పొందగలిగింది.గోలకొండ పత్రిక తెలంగాణ ప్రాంతములో రాజకీయ చైతన్యాన్ని, సాహిత్యాభిలాషను కలిగించటమే కాకుండా గ్రంథాలయోద్యమమునకు, ప్రజల దాస్య విముక్తికి విశేషముగా కృషిచేసింది.8

స్వాతంత్ర్యానంతరము వచ్చినపత్రికలకు స్వేచ్ఛతోపాటుబాధ్యతకూడ పెరిగినది. పత్రికాప్రచురణ అధికమగుటయేకాక పోటి తత్వము, వ్యాపారాత్మక ధోరణి పెరిగినది.సాహిత్యాభిమానులను ఆకర్షించు విధముగా రచయితలు రచనలు చేయనారంభించిరి. ఆ విధముగా ప్రాచుర్యాన్ని పొందిన శీర్షికలు కొన్ని ఆంధ్రప్రభ –పాన్ సుపారి, ఆంధ్ర పత్రిక దాసువామనరావుగారి కాలక్షేపము, శ్రీశ్రీ తాడు బొంగరము, ఆరుద్ర కుర్చీలో కూనిరాగము విద్వాన్ విశ్వం మాణిక్య వీణ మొదలైనవి.9

తెలుగులో ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులుగా,ఆంధ్రపత్రిక సంపాదకులుగా నార్ల వేంకటేశ్వర రావుగారికి అమితమైన కీర్తి లభించింది. —వాస్తవమ్ము నార్లవారిమాట, నవయుగాల బాట నార్లమాట అను మకుటముతోనార్ల వెంకటేశ్వరరావు ఆటవెలది పద్యాలను రచించిరి.10 తెలంగాణ తేజము సురవరంప్రతాపరెడ్డిగారు రచించిన ఆంధ్రుల సాంఘీకచరిత్ర ను గురించి ఆంధ్రప్రభలో ఒక సంపాదకీయమే రచించిరి. (22 నవంబరు 1949).సురవరం ప్రతాపరెడ్డిగారు చేసిన విశేషకృషి గోలకొండ కవుల సంచికగా వెలువడుటకు ప్రేరేపణగోలకొండ పత్రిక.11

ప్రముఖ పత్రికారచయిత విద్వాన్ విశ్వంబహుగ్రంధకర్త.1936 1937 లోనే భారతిలో ఆయన రచనలు ప్రచురింపబడినవి.. మీజాన్ పత్రిక, ఆంధ్రపత్రిక , ఆంధ్రజ్యోతి పత్రికల ద్వారా పత్రికారచయితగా గుర్తింపు పొందిరి. ఆంధ్రప్రభలో వీరి మాణిక్యవీణ శీర్షిక ప్రసిద్ధమైనది. ఆంధ్రప్రభ దినపత్రికగా ప్రారంభమై తరువాత వార పత్రికగా మారింది.ఇదే విధముగా ఉత్తమ సంపాదకులుగా, పత్రికా రచయితలుగా తాపీ ధర్మారావు, పొత్తూరి వెంకటేశ్వరరావు మొదలైనవారు ప్రసిద్ధులైనారు.

ఈనాడు కూడ తెలుగుపత్రికలు ఇతోధికముగా సాహిత్యసేవ చేస్తున్నవి. తెలుగులో దిన, వార , మాస, త్రైమాస, అర్ధ సంవత్సర , సంవత్సర కాల వ్యవధిలో వచ్చే పత్రికలు వెలువడినవి. వీనిలో స్వాతంత్ర్యమునకు పూర్వము, తరువాత కూడ దిన పత్రికలురాజకీయములకు, వార్తలకు అధికప్రాధాన్యతను ఇచ్చినవి.వార,మాస పత్రికలు కధలకు, నవలలకు, ఇతర సాహిత్య ప్రక్రియలకు ప్రాధాన్యము ఇచ్చెడివి.భారతి, సుజాత మొదలైనవి కేవలము సాహిత్య పత్రికలుగా ప్రసిద్ధి పొంది, అమూల్యమైన రచనలు వెలువడటకు కారణమైనవి. కాల క్రమేణసాహిత్య పత్రికలు అంతరించినవి. కాని ఇతర పత్రికలు సాహిత్యమునకు తగువిధముగా ప్రాధాన్యమునిచ్చి, ఇతోధికముగా సాహిత్యసేవ చేయుచున్నవి.

ఈనాటి దినపత్రికలలో ప్రముఖమైనవి —ఈనాడు, వార్త, ఆంధ్ర భూమి, ఆంధ్రజ్యోతి, సాక్షి మొదలైనవి. వార్తలసే కాక సాహిత్యాభిరుచినిపెంపొందించేవిధముగా కొన్ని శీర్షికలను, సంపాదకీయాలను , కవితాప్రక్రియలను, , కథానికలను, సీరియల్స్ ను, వెలువరుస్తున్నాయి. అదేవిధముగా ఆదివారమునాడు వెలువడు ప్రత్యేక అనుబంధములలో ఉత్తమసాహిత్య విలువలుగల కథానికలను, ప్రత్యేక సందర్భాలలో కవుల, రచయితల స్మృతి సూచకమైన వ్యాసములను, పుస్తకసమీక్షలను, పదబంధములతో కడిన గళ్ళ నుడికట్టును (పజిల్స్) ప్రచురిస్తున్నవి.. ప్రతిరోజు వెలువడే పత్రికలోను కొంతప్రదేశమునుకాని, ఒకపేజినికాని కేటాయించి , నగరములో ఆరోజు నిర్వహింప బడిన సభలను, సాహిత్యసమావేశములను, వాటిల్లో ప్రధాన వక్తలు మాట్లాడిన ప్రధాన అంశాలను ప్రచురిస్తు ఉంటారు. విద్యార్ధులకు , ఉద్యోగార్ధులకు భాషాజ్ఞానమును, సాహిత్య పరిజ్ఞానమును పెంపొందించేవిధముగా ప్రశ్నోత్తరమాలికను (క్విజ్) రూపొందించి ప్రతిభ అను శీర్షికను ఈనాడు దినపత్రిక అందజేస్తోంది.

పండుగలు, పుష్కరాలు మొదలైన సందర్భాలలో వాటి ప్రాశస్త్యాన్ని,పౌరాణిక ప్రాధాన్యతను ఈ తరమువారికి వివరిస్తు ప్రత్యేక వ్యాసములను, పండితుల అభిప్రాయములనుజోడిస్తు పత్రికలు ప్రచురించును. కవుల, కళాకారుల , సంఘసంస్కర్తల, విశిష్ట వ్యక్తుల జయంతులను, వర్ధంతులను పురస్కరించుకొని, వారి సంస్మరణార్ధము ప్రత్యేక వ్యాసములను ప్రచురించును. ఒకరకముగా వారు చేసిన విశిష్ట సేవలను పురస్కరించుకొని వారికి కృతజ్ఞతలు తెలియ చేయటమే ఇటువంటి రచనలప్రధాన ఉద్దేశ్యము, ఈతరము వారికి స్ఫూర్తిదాయకముగా ఈ వ్యాసములు ఉండును. దీనికి ఉదహరణలుగా ప్రధానముగా రెండు వ్యాసములను పేర్కొన దలచాను. మొదటిది ఇటీవల దివంగతులైన ఆచార్య చేకూరి రామారావు గురించి ఈనాడు దినపత్రికలో వెలువడినవ్యాసము. రెండవది ప్రముఖ దర్శకుడు. చిత్రకారుడు అయిన బాపును గురించి వెలువడిన వ్యాసము.

ఆచార్య చేకూరి రామారావుగారు పరమపదించారు అన్నవార్తతోపాటు వారు చేసిన భాషాసేవను స్మరిస్తు, భాషాశాస్త్రవేత్తగా, సాహిత్య విమర్శకునిగా వారి కృషిని ఈ తరమువారికి తెలియ చేయటము జరిగింది.

అదే విధముగా ప్రఖ్యాత దర్శకుడు. చిత్రకారుడైన బాపు ఇకలేరన్న వార్తతోపాటు , వారి బహుముఖ ప్రతిభను కొనియాడుతు వెలువడిన వ్యాసము వారు వెలువరించిన ఆణి ముత్యాలను, ప్రముఖ రచయిత ముళ్ళపూడి వెంకటరమణగారితోఉన్న స్నేహబంధాన్ని స్మరిస్తు, వాటిని ఈ తరమువారికి తెలియచేయటము జరిగింది.

ఈ విధముగా దినపత్రికలు తమకుగల స్వల్పపరిధిలోనే సాహితీసేవ చేస్తున్నాయి., తెలుగులో వెలువడుతున్న దినపత్రికలు నాలుగైదు ఉన్నప్పుడు వాటిమధ్య పోటి సహజము. ''స్పర్ధయావర్ధతే విద్య' అన్నట్లుగాఆ పోటి వలన ఉత్తమసాహిత్యము వెలువడుతుంది. వ్యాపారాత్మకధోరణితో పాటు సాహిత్య, సంప్రదాయ, సాంస్కృతిక విలువలను అందించుటలోను పోటి వలన ఉత్తమ సాహిత్యము వెలువడుతుంది.

**అధోజ్ఞాపికలు–**


1.పత్రికలు –ఎం.సుధ –నూరేళ్ళ తెలుగునాడు పుట-103,

2.పత్రికలు –ఎం.సుధ –నూరేళ్ళ తెలుగునాడు పుట 104

3..పత్రికలు –ఎం.సుధ –నూరేళ్ళ తెలుగునాడు పుట 107,108

4.పత్రికలు –ఎం.సుధ –నూరేళ్ళ తెలుగునాడు పుట 108,

5. పత్రికలు –ఎం.సుధ –నూరేళ్ళ తెలుగునాడు పుట 109,.

6.పత్రికలు –ఎం.సుధ –నూరేళ్ళ తెలుగునాడు పుట 115,116

7. తెలుగుసాహిత్యపత్రికలు తెలుగులో పరిశోధన పుట-4446 ఉస్మానియ విశ్వవిద్యాలయము

8.తెలుగుపత్రికలు-సంపాదకీయములుమహతి--ప్రస్తారం. పుట-84

9..తెలుగుపత్రికలు వివిధశీర్షికలుమహతి--ప్రస్తారం. పుట-88

10..తెలుగుపత్రికలు సంపాదకీయములుమహతి--ప్రస్తారం. పుట-86

11. చిరస్మరణీయులు డా.పొత్తూరి వేంకటేశ్వరరావు. పుట-65.

**ఉపయుక్త గ్రంథములు.–**

1. నూరేళ్ల తెలుగునాడు--1857 1956వరకు ఉపన్యాసములసంకలనము సంపాదకుడు కె.కె.రంగనాధాచార్యులు
2. మహతి ---యువభారతి ప్రచురణ.
3. తెలుగు భాష—పరిశోధన---ఉస్మానియా విశ్వ విద్యాలయము.
4. చిరస్మరణీయులు డా. పొత్తూరి వేంకటేశ్వర రావు.

ANNQUEST